మహేశ్వరంలో రూ.130 కోట్లతో నాలాల అభివృద్ధి

విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



ఈస్ట్ యాదవ్‌నగర్ కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి



గోమాత సేవలో మంత్రి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలో రూ.130 కోట్లతో నాలాలను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురి రోడ్ నం.18 (మసీద్ ఎదురుగా) యూజీడీ పైప్‌లైన్, ఈస్ట్ యాదవ నగర్‌లో.40 లక్షలతో చేపట్టే డ్రైనేజీ, ఆర్‌సీసీ లైన్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, బొగ్గారపు దయానంద్, ఆర్‌కే పురం కార్పొరేటర్ రాధ ధీరజ్‌రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఈస్ట్ యాదవ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఈస్ట్ యాదవనగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కేవలం వర్షపు నీరు పోయేలా నాలాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని తెలిపారు. ఆర్‌కేపురం డివిజన్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ పంకజ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, బేర బాలకిషన్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సాజీద్, సునీతరెడ్డి, కొండల్‌రెడ్డి, స్వప్నరెడ్డి, గిరిగౌడ్, శేఖర్, కొంద్ర శ్రీనివాస్, బీజేపీ నాయకులు రాములు యాదవ్, సుదర్శన్, రమేష్‌గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ భగవాన్ ఆలయంలో

ఆర్‌కేపురం డివిజన్ యాదవ్‌నగర్ కాలనీలోని శ్రీకృష్ణ భగవాన్ ఆలయంలో శనివారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అల్కాపురిలో ఆధ్యాత్మికవేత శ్రీనివాస బంగారయ్య శర్మ ఏర్పాటు గోశాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస బంగారయ్య శర్మ, ముదిగొండ శంకర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు పుస్తకాల విరాళం

దిల్‌సుఖ్‌నగర్: అమ్మా నాన్నలు లేని అనాథలను చేరదీసి భోజన, వసతి, అన్ని విద్యా సౌకర్యాలు కల్పించి వారి భవిష్యత్‌కు కృషి చేస్తున్న అనాథ విద్యార్థి గృహం మేనేజింగ్ కమిటీకి ప్రత్యేక అభినందనలని హర్ష ఓల్డ్ ఏజ్ ఆశ్రమం (వృద్ధాశ్రమం) మేనేజింగ్ డైరెక్టర్ మోహిని రెడ్డి అన్నారు. వనస్థలిపురం విజయశ్రీ కాలనీలోనీ వృద్ధాశ్రమం మేనేజింగ్ డైరెక్టర్ మోహిని రెడ్డి తమ జన్మదిన వేడుకలు శనివారం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులు మధ్య ఘనంగా జరుపుకున్నారు. మోహిని రెడ్డి విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి, గృహంలోని పాఠశాల విద్యార్థులకు, 2023–24 విద్యా సంవత్సరానికి అవసరమయ్యే పాఠ్యపుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శివారెడ్డి, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌డీపీ పనులతో సత్ఫలితాలు: ఎమ్మెల్యే



వీవీ నగర్‌లో బాక్స్ డ్రెయిన్ పనుల వద్ద నిలిచిన నీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: వరద ముంపు నుంచి కాపాడేందుకు చేపట్టిన ఎస్‌ఎన్‌డీపీ పనుల వల్ల సత్ఫలితాలు వస్తున్నాయని, సరూర్‌నగర్ లోతట్టు కాలనీలకు మేలు జరిగిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం గడ్డిఅన్నారం డివిజన్‌లోని కోదండరాంనగర్ కాలనీ, వీవీనగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. పైప్‌లైన్ పనుల దగ్గర చెత్తాచెదారం చేరడంతో వరదనీరు పొంగి పొర్లిందన్నారు. వెంటనే చెత్తను తొలగించామన్నారు. సరూర్‌నగర్ చెరువు ఔట్‌లెట్ గేట్లు ఎత్తివేయటం వల్ల కాలనీల్లోని రహదారులపై నీరు చేరగా వెంటనే గేట్లు మూసివేయించామన్నారు. చెరువుకు మూడో గేటు ఏర్పాటు చేయటం వల్ల కోదండరాంనగర్, వీవీనగర్ కాలనీలు ముంపు సమస్య నుంచి విముక్తి లభించిందన్నారు. ఇంకా మిగిలిన కొన్ని సమస్యలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం: కొప్పుల

మన్సూరాబాద్: డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, ఎక్కడ చూసినా మురుగు నీరు దర్శనం ఇస్తోందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అధికారులపై మండిపడ్డారు. శనివారం ఆయన ఆగమయ్యనగర్ కాలనీలో పొంగి పొర్లుతున డ్రైనేజీని హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ సివరేజ్ బోర్డు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ గత రెండు,మూడేళ్లుగా ఆగమయ్య కాలనీ ప్రజలు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఎస్‌ఈ అశోక్ రెడ్డి, ఈఈ రమేష్‌బాబు, ఏఈ స్వప్న, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం: డీసీ

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూసీనది పరీవాహక ప్రాంతాలలో నివసిస్తున్న కాలనీవాసులతో పాటు సిబ్బందిని అప్రమత్తం చేశామని మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. శనివారం మలక్‌పేటలోని తన కార్యాలయంలో డీసీ మాట్లాడుతూ, హిమాయత్ సాగర్ నుంచి వరదనీరు ఉద్రిక్తతపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నామన్నారు. మూసీ పరీవాహక ప్రాంతాలలో మాన్‌సూన్ సిబ్బందిని అప్రమత్తం చేశామని, షిఫ్ట్ పద్ధతిలో 15 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా కాలనీ సంఘాల అధ్యక్షులను, డివిజన్ కార్పొరేటర్లను అప్రమత్తంగా ఉండాలని కోరామన్నారు. ప్రస్తుతం హిమాయత్ సాగర్ నాలుగు గేట్లు తెరిచారని, 12 గేట్లు తెరిస్తే ముంపు కాలనీవాసులకు ప్రత్యేక కమ్యూనిటీహాల్ ఏర్పాటు చేసి అక్కడికి తరలిస్తామని డీసీ జయంత్ తెలిపారు.

'నారాయణ'పై చర్యలు తీసుకోండి: ఏబీవీపీ

మలక్‌పేట: సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ కాలేజ్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగిఫణి హనుమాన్ డిమాండ్ చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రభుత్వం సెలవులు ప్రకటించినా.. నిబంధనలకు విరుద్ధంగా కాలేజ్ తెరిచిన దిల్‌సుఖ్‌నగర్ నారాయణ కాలేజ్ బుచ్చిరెడ్డి, సరస్వతి క్యాంపస్‌ల్లో నిర్వహిస్తున్న తరగతులను ఏబీవీపీ నాయకులు బంద్ చేయించారు. ఈ సందర్భంగా రాగిఫణి హనుమాన్ మాట్లాడుతూ, కార్పొరేట్ కాలేజ్‌లు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి కాలేజ్‌లు నడపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలకు అనుకోని ప్రమాదాలు జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు టేకులపల్లి మధు, గంగాధర్, కొత్తగొల్ల అనిల్, రంజిత్ పాల్గొన్నారు.

గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు



నాగోలు: రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన వేద రజినిని శనివారం తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూర బ్రహ్మయ్య కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం నాయకులు లట్టుపల్లి తిరుపతి, ఇడ్లింపల్లి రమేష్, నగేష్, వడ్డెబొయిన వెంకటేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ షాపులో స్వల్ప అగ్నిప్రమాదం

చైతన్యపురి: సరూర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ మొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు...దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్రధాన రహదారిపై ఉన్న క్యాసిపై మొబైల్ దుకాణంలో నుంచి శుక్రవారం అర్ధరాత్రి పొగ రావడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి అగ్నిమాపక సిబ్బంది, డీఆర్ఎస్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. షట్టర్ పగులగొట్టి ఫైరింజన్‌తో మంటలను ఆర్పేశారు. దుకాణంలో కొంత భాగానికి మంటలు అంటుకున్నట్లు గుర్తించారు. సుమారు లక్ష రూపాయల విలువైన సామగ్రి మంటల్లో కాలిపోయాయని దుకాణం నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చైతన్యపురి: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం...గురువారం సాయంత్ర లింగోజిగూడ బృందావన్ కాలనీలో సుమారు 40 సంవత్సరాల వయస్సు గల ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే పోలీస్ స్టేషన్‌లో వివరాలు అందజేయాలని ఎస్ఐ కోరారు.

నేడు నాగోలు, బండ్లగూడల్లో బోనాలు

నాగోలు: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం బోనాల జాతర నిర్వహిస్తున్నారు. మహంకాళి దేవస్థానం, పోచమ్మ దేవస్థానం కమిటీ, నాగోల్ గ్రామ అభివృద్ధి కమిటీ, నవ చైతన్య కమిటీ ఆధ్వర్యంలో నాగోలు గ్రామంలో బోనాల ఉత్సవాలు జరగనున్నాయి. డివిజన్ పరిధిలోని బండ్లగూడ, ఫతుల్లాగూడ, నాగోలు సాయినగర్ కాలనీ, ఆనంద్‌నగర్ గణేష్‌నగర్‌ల్లో బోనాల జాతర ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఆలయాలకు రంగులు వేసి, పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహంకాళి, పోచమ్మ, రేణుక ఎల్లమ్మ, కట్ట మైసమ్మ, ముత్యాలమ్మ, ఈదమ్మ తదితర గ్రామ దేవతలకు మహిళలు పెద్ద ఎత్తును బోనాలు సమర్పించనున్నారని ఉత్సవాల నిర్వాహకులు చెప్పారు 24న ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించనున్నట్టు తెలిపారు.

హయత్‌నగర్‌లోనూ...

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని పోచమ్మ, కట్టమైసమ్మ, పెద్దమ్మ, ఈదమ్మ బోనాలను ఆదివారం నిర్వహిస్తునట్లు డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయా ఆలయాల వద్ద ఏర్పాట్లను కార్పొరేటర్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సామరస్యంగా పండుగ జరుపుకోవాలని ఆయన భక్తులకు పిలుపునిచ్చారు.

నేటి నుంచి యోగాలో ఉచిత శిక్షణ

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ భవానినగర్ మహిళా మండలి భవనంలో ఆదివారం నుంచి సిద్ధ సమాధి యోగాలో ఉచిత శిక్షణ ఇస్తామని యోగా గురువు సద్గుణాచారి తెలిపారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ తరగతులు ఉంటాయన్నారు. దీర్ఘకాలంగా పీడించే ఆస్తమా, అల్సర్లు, డయాబెటిక్, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, పక్షవాతం, ఊబకాయం, ఎలర్జీల నుంచి విముక్తి కలిగించే సాధనం సిద్ధ సమాధి యోగా అని యోగాగురువు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.93933 57033ను సంప్రదించవచ్చన్నారు.

జర్నలిస్టులకు ఓమ్ని హాస్పిటల్ అండ



జర్నలిస్టుల ప్రమాద బీమా ప్రీమియం చెక్కును అందజేస్తున్న ఓమ్ని హాస్పిటల్ యాజమాన్యం

నాగోలు: సమాజ శ్రేయస్సు కోసం పనిచేసే జర్నలిస్టులకు తమ వంతు సహాయ, సహకారాలు అందజేస్తూ అండగా ఉంటామని కొత్తపేట ఓమ్ని హాస్పిటల్ యజమానులు డాక్టర్ వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి, డాక్టర్ గౌతమ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని జర్నలిస్టులకు రూ. 10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కోసం శనివారం వారు బీమా ప్రీమియం నిమిత్తం రూ. 2.5 లక్షల చెక్కును టాటా ఇన్సూరెన్స్ సంస్థకు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ జర్నలిస్టులు మేకల సత్యనారాయణ, కటకం సుభాష్, చిత్రం సైదులు, ఓరుగంటి నాగరాజు, అశోక్‌గౌడ్, నాగరాజు యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



విష్ణు

నాగోలు: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థి అదృశ్యమైన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మన్సూరాబాద్‌కు చెందిన నాంపల్లి విష్ణు(19) ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రాయగా తప్పాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అతను శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధు, మిత్రులను వాకబు చేసినా విష్ణు ఆచూకీ తెలియరాలేదు. దీంతో తండ్రి నాంపల్లి గణేష్ శనివారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులను కంటికి రెప్పలా సీఎం కాపాడుతున్నారు

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి



సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వాసుదేవరెడ్డి

చాదర్‌ఘాట్: దివ్యాంగులను కంటికి రెప్పలా ముఖ్యమంత్రి కేసీఆర్ కాపాడుతున్నారని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి అన్నారు. దివ్యాంగుల ఆసరా పెన్షన్‌ను పెంచినందుకు శుక్రవారం ఆయన ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శనివారం మలక్‌పేటలోని కార్యాలయంలో వాసుదేవరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, దివ్యాంగులకు సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. గృహలక్ష్మి పథకంలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్, బధిరులకు ప్రత్యేక డిగ్రీ కాలేజ్, స్కీమ్‌ల అమలుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరామన్నారు. రోస్టర్ 56 వల్ల శారీరక దివ్యాంగుల ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లగా .. వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారని వాసుదేవరెడ్డి తెలిపారు.

పాణిరావు మృతి బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు తీరని లోటు

మలక్‌పేట: మాజీ అంతర్జాతీయ రిఫరీ, తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి, హైదరాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పాణిరావు(72) ఆకస్మిక మరణంపై రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ శనివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసింది. జాతీయ చీఫ్ కోచ్, రాష్ట్ర బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లెల గోపిచంద్, కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్, పి.ఆనందబాబు, టీఎస్ఆర్ రవి, కోశాధికారి యూవీఎస్ బాబు, సంయుక్త కార్యదర్శి సాయిరెడ్డి తదితరులు పాణిరావు మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం తెలియజేశారు. పాణిరావు మృతి అసోసియేషన్‌కు తీరని లోటని కరెడ్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు.

బీజేపీ మహాధర్నాను విజయవంతం చేయండి: సంరెడ్డి

సైదాబాద్: నిరుపేదల ఇళ్ల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి కోరారు. శనివారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని భూలక్ష్మీనగర్ తదితర బస్తీల్లో ఆయన పార్టీ నాయకులతో కలిపి పర్యటించి బస్తీవాసులకు ధర్నా గురించి వివరించారు. ఈనెల 25న 25 వేల మంది పేదలతో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బీజేపీ మహాధర్నా నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రంలో నిరుపేదల ఇళ్ల కష్టాలు తీరేవరకు పార్టీ తరపున పోరాటం చేస్తామన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బీజేపీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా తిరునక్షత్రోత్సవం



తిరునక్షత్రోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు

మలక్‌పేట: మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో అధిక శ్రావణ శుక్ల చవితి సందర్భంగా శనివారం తిరునక్షత్రోత్సవాన్ని వైభవోపేతంగా జరిపారు. ఉదయం 10.30 గంటలకు అభిషేకం తర్వాత అర్చన, తనియ విన్నపం, 108 గంగాళముల(పాత్రలు)లో అక్కారి వడిశల్ ప్రసాద నివేదన గావించారు. ఆ తర్వాత తీర్థప్రసాద గోష్ఠి, ఒడినింపే కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకురాలు ఎ.లక్ష్మీదేవి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నలభై సంవత్సరాలుగా తిరునక్షత్రోత్సవం నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రూపాదేవి, రామకృష్ణ ,భక్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రాస్‌బో షూటింగ్ పోటీలకు లింగోజిగూడ యువకుడి ఎంపిక




మెడల్ అందుకుంటున్న కూర గణేష్

లింగోజిగూడ: ఆగ్రాలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి అండర్ 23 క్రాస్ బో షూటింగ్ చాంపియన్‌షిప్ 2023లో లింగోజిగూడకు చెందిన కూర గణేష్ బ్రాంజ్ మెడల్ సాధించాడు. జాతీయ స్థాయిలో సత్తా చాటిన ఇతడిని భారత్ తరపున అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. కూర గణేష్ నగరంలోని బద్రుక కళాశాలలో బీకాం హానర్స్ చదువుతున్నాడు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన నేపథ్యంలో గణేష్ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి భారత్‌కు పేరు తీసుకొస్తానని, బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నాడు.

రహదారులపై మురుగు పారకుండా చర్యలు

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో రహదారులపై మురుగు పారకుండా తగిన చర్యలు తీసుకుంటామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి సైదాబాద్‌లోని పూసలబస్తీ, మూడుగుళ్ల చౌరస్తాల వద్ద పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు బస్తీలోని అంతర్గత రహదారులపై డ్రైనేజీలు పొంగి రహదారులపై మురుగు పారుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కార్పొరేటర్ డ్రైనేజీల్లో క్రమం తప్పకుండా పూడిక తీయించాలని వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీ పైప్‌లైన్లు ఆధునీకరించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు అమ్మవారి ఆలయాలను ఆమె పరిశీలించారు. శ్రావణ మాస బోనాలు నిర్వహించుకునే ఆలయాల వద్ద సౌకర్యాలు కల్పించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ శ్రవణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడమే బీఆర్‌ఎస్ ఎజెండా: సామ



చైతన్యపురిలో పాదయాత్ర చేస్తున్న సామ రంగారెడ్డి, రంగా నర్సింహగుప్తా

చైతన్యపురి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయడమే ఎజెండాగా పెట్టుకొని పాలన చేస్తోందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తాతో కలిసి చైతన్యపురి డివిజన్‌లో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, బీజేపీ ఆధ్వర్యంలో తొమ్మిదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందన్నారు. ఇంద్రసేనారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 1999లో వేసిన రోడ్లే ఇప్పటికీ సత్యానగర్, మారుతీ నగర్‌లలో కనిపిస్తున్నాయన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆధునీకరించలేదని విమర్శించారు. 2020లో ఎల్‌బీనగర్ నియోజవర్గంలో అనేక ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయని, అప్పట్లో మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హడావుడి చేశారు తప్ప, చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ నాయకులు వినోద్‌యాదవ్, రుధారపు శంకర్, కృష్ణప్రకాష్, నవీన్‌యాదవ్, నరేందర్, శ్రీనివాసకృష్ణ, వెంకన సుమన్‌గౌడ్, శివకుమార్, అంజిబాబు, అర్జున్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పేరుతో మోసం చేస్తున్న ప్రభుత్వం: బీజేపీ

సైదాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మభ్యపెట్టి మోసం చేస్తున్నదని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు మేరకు శనివారం ఆయన పలువురు బీజేపీ నాయకులతో కలిసి మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని శంకేశ్వరబజార్ డబుల్ బెడ్రూమ్ లబ్ధిదారుల వివరాల సర్వే సేకరణ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శంకేశ్వరబజార్‌కు చెందిన 200 మందికి పైగా పేద మహిళలు 2016లో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటి వరకు ప్రభుత్వం వారినిపట్టించుకోవడం లేదని అన్నారు. డబుల్ బెడ్రూమ్ పథకంలో మోసపోయిన పేదలకు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ సాయంతో ఇళ్లు అందజేస్తామన్నారు. బీజేపీ నాయకులు అశోక్‌గౌడ్, చంద్రయ్య, గజానంద్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న మహిళా కండక్టర్

హయత్‌నగర్: బస్సులో పోగొట్టుకున్న చెవి దిద్దిని ప్రయాణికురాలికి అందజేసి నిజాయితీని చాటుకుందో మహిళా కండక్టర్. డీఎం రఘు కథనం ప్రకారం... హయత్‌నగర్–1 డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న ఉదయశ్రీ శనివారం అనాజ్‌పూర్ ఉమెన్స్‌కాలేజ్ రూట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. లష్కర్‌గూడలో సుగుణ అనే మహిళ బస్సు ఎక్కి పనామా వద్ద దిగింది. తాను కూర్చున్న సీటు వద్ద తన చెవి దిద్దులలో ఒకదానిని (సుమారు రూ. 25000 విలువైనది) పోగొట్టుకుంది. దీనిని గమనించిన కండక్టర్ డిపో అధికారులకు సమాచారం అందించారు. చెవి దిద్ది బస్సులో పడిపోయినట్టు గ్రహించిన ప్రయాణికురాలు వెంటనే బస్సు వెంట వెళ్లి కండక్టర్‌ను అడగ్గా.. డిపోకు వచ్చి తీసుకోమని చెప్పింది. డిపో మేనేజర్ రఘు, సహాయ మేనేజర్లు కిష్టయ్య, విజయకుమారిల చేతుల మీదుగా ప్రయాణికురాలికి చెవి దిద్దిని అందించారు. విజిలెన్స అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్: తెలంగాణ రవాణా రంగ కార్మికుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ పోస్టర్‌ను శనివారం ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, పీసీసీ డెలిగేట్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రవాణా రంగ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు కట్టుదిట్టమైన చర్యలు

వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి



ఏసీపీ భీంరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: వనస్థలిపురం ఏసీపీగా బదిలీపై వచ్చిన ఎస్.భీంరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి పుష్పగుచ్ఛంఅందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏసీపీ భీంరెడ్డి మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. నేరాల అదుపు చేసేందుకు ఎక్కడికక్కడ పోలీసు తనిఖీలు చేపడతామన్నారు. ప్రజల సహకారంతో అన్ని రకాల నేరాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ భీంరెడ్డి వెల్లడించారు. వనస్థలిపురం డీఐ వెంకట్ , ఎస్ఐలు మాధవరెడ్డి, జగన్, రవి పాల్గొన్నారు.

వార్డు ఆఫీస్ ప్రారంభోత్సవాన్ని వాయిదా వేయండి



జెడ్సీని కలిసిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి, ఎన్‌జీఓస్ కాలనీ వాసులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ ఎన్‌జీఓస్ కాలనీ సంక్షేమ సంఘం, హౌసింగ్ సొసైటీ సభ్యులు శనివారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ (జెడ్సీ) పంకజను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో పాటు జెడ్సీని కలిసిన వారు బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ వార్డు ఆఫీస్ ప్రారంభోత్సవాన్ని మరో నెల రోజుల పాటు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీ స్థలంలో మోడల్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారని, ఈ విషయంపై కోర్టులో కేసు నడుస్తోందన్నారు. అక్కడే వార్డు కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారన్నారు. స్థల వివాదానికి సంబంధించి త్వరలో కోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకు వార్డు కార్యాలయ ప్రారంభోత్సవాన్ని వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కాలనీ వాసులు సోమయాజులు, వెంకటేశ్వరరావు, సాయి కుమార్, జైపాల్‌రెడ్డి, వర్ధని, శరత్, నరసింహారెడ్డి, అలీఖాన్, న్యూటన్, ఆనంద్, శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.